క్లుప్తంగా

మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం


ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న వికాస్‌రావు

వేములవాడఅర్బన్‌: వేములవాడ మండలం ఆరెపల్లి గ్రామంలో ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్‌ను బుధవారం కరీంనగర్ ప్రతిమ ఫౌండేషన్ నిర్వహకులు డాక్టర్ చెన్నమనేని వికాస్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో మహిళలకు ఉచిత కుట్టు మిషన్లు, వైద్య శిబిరాలు, అంబులెన్స్ సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. సర్పంచ్ ఇటుకల నవీనరాజు, ఎంపీటీసీ బుర్ర లహరిక, బీజేపీ మండల అధ్యక్షుడు చింతపల్లి వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ మల్లేశం పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం


బిరం ముగింపు కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, విద్యార్థులు

రుద్రంగి: వేసవిలో విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఏర్పాటు చేసిన వేసవి క్రీడా శిక్షణ శిబిరం బుధవారంతో ముగిసింది. రుద్రంగి జెడ్పీ హైస్కూల్ తెలంగాణ క్రీడా ప్రాంగణంలో మే ఒకటి నుంచి మొదలై నెల రోజుల పాటు సాగిన క్రీడా శిక్షణ శిబిరంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని, వాలీబాల్ క్రీడలో మెలకువలు నేర్చుకున్నారు. ముగింపు కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

ఎల్లమ్మకు బోనాలు


నిజామాబాద్‌లో బోనాలు తీస్తున్న మహిళలు

కోనరావుపేట: మండలంలోని నిజామాబాద్‌లో రేణుకా ఎల్లమ్మ సిద్దోగం వేడుకల్లో భాగంగా గౌడ సంఘం ఆధ్వర్యంలో రాత్రి రేణుకా జమదగ్ని మునిరాజు కల్యాణ వేడుకలు కనుల పండువగా నిర్వహించారు. గౌడ సంఘం మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి ఎల్లమ్మకు నైవేద్యంగా సమర్పించారు. ఈ వేడుకల్లో సర్పంచ్ కేతిరెడ్డి అరుణ, బీఆర్ఎస్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి, కరీంనగర్ జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, నాయకులు మేర్గు లక్ష్మణ్, వంగపెల్లి శ్రీనివాస్, మహేశ్, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

అందాల అడవి

- ప్రకృతిని ఆస్వాదించేందుకే రూ.6 కోట్ల వ్యయంతో అర్బన్ పార్క్
- 50 హెక్టార్లలో ఆకట్టుకుంటున్న కట్టడాలు
- మంత్రి కేటీఆర్ చొరవతో పూర్తికావస్తున్న పార్క్

ఎల్లారెడ్డిపేట: చుట్టూ దట్టమైన అడవి.. ఎత్తైన గుట్టలు.. మహావృక్షాలు.. పక్షుల కిలకిల రావాలు.. కనువిందు చేసే జింకలు, నెమళ్లు, అడవి జంతువులు.. వెరసి శత్రు దుర్భేద్యమైన అడవిలో అందంగా అర్బన్ పార్క్ ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయి. మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవతో 50 హెక్టార్ల విస్తీర్ణంలో రూ.6 కోట్ల వ్యయంతో పట్టణాలకు దీటుగా ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్ గ్రామశివారులోని అడవిలో అర్బన్ పార్క్ ముస్తాబవుతోంది. ఇప్పటికే పార్క్‌లో కూర్చునేందుకు గడీల బల్లలు, అడవి అందాలను తిలకించేందుకు సుందరమైన వంతెన ఏర్పాటు, అడవిలో ఉన్న చెరువును సుందరీకరించి అందులోకి వెళ్లి చుట్టూ పరుచుకొని ఉన్న అందాలను వీక్షించేందుకు ప్రత్యేక వంతెన, ముఖద్వారం, రోడ్డు పనులు పూర్తయ్యాయి. వన్యప్రాణుల కోసం వీలైనన్ని ఎక్కువ మొక్కలు పెంచేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కలెక్టర్ అనురాగ్ జయంతితో పాటు అటవీశాఖ ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పనులు పర్యవేక్షించి అధికారులు తగు సూచనలు చేస్తున్నారు. ఈ పార్క్ ద్వారా అడవిలో అందాలను తిలకించేందుకు జిల్లా ప్రజలు నిరీక్షిస్తున్నారు.



ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యోగ శిబిరం


చూడముచ్చటగా వుడెన్ కుటీరం

సుందరంగా అర్బన్ పార్క్

హరిదాస్ నగర్‌లోని అర్బన్‌పార్క్ పనులు శరవేగంగా పూర్తికావచ్చాయి. భవిష్యత్తు తరాలకు అడవులు, జంతువులు, మొక్కల రకాలపై అవగాహన కల్పించేలా సహజమైన అడవికి వెళుతున్నామనే భావన కల్పించేలా పనులు చేశారు. అందమైన ముఖద్వారామే అందుకు నిదర్శనం. సందర్శకులు కూర్చునేందుకు గజీబో, లోటస్ పాండ్, యోగా కేంద్రం నిర్మాణాలు పూర్తికాగా, పార్క్ చుట్టూ ఆరు కిలోమీటర్ల మేర వాకింగ్ ట్రాక్, కూర్చునేందుకు బెంచీలు, తాగునీటి వసతి కల్పించారు. దీనికి తోడు పార్క్‌లో నర్సరీ, టాయిలెట్లు, ఆర్చ్, అంతర్గత రోడ్డు సౌకర్యాలు కల్పించారు. ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు అడవుల పునరుద్ధరణలో భాగంగా ఈ పార్క్ నిర్మాణం చేపట్టారు. మొత్తంగా పార్క్ నిర్మాణాన్ని సుందరీకరిస్తున్నారు. త్వరలో మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభించనున్నారు.


ప్రత్యేక ఆకర్షణగా చెరువు మధ్యలో వంతెన


ఆకర్షణగా ముఖద్వారం

హైదరాబాద్ పార్క్‌లను తలపించేలా

హైదరాబాద్ లాంటి పట్టణాల్లో ఉన్న పార్క్‌లను తలపించేలా దట్టమైన అడవిలో అర్బన్ పార్క్‌ను ఏర్పాటు చేశారు. పట్టణాల్లోని పెద్ద పెద్ద పార్క్‌లను ప్రతి జిల్లాలో ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావించగా రాజన్న సిరిసిల్ల జిల్లాలోని హరిదాస్‌నగర్‌లో తొలి అడుగు పడింది. జిల్లా కేంద్రానికి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న అటవీ ప్రాంతంలో అర్బన్ పార్క్ ఏర్పాటుకు మంత్రి కేటీఆర్ నిధులు కేటాయించి వేగవంతంగా పనులు జరిగేలా సంబంధిత అధికారులను ఆదేశించారు. సిరిసిల్ల–కామారెడ్డి పక్కనే ఉన్న అడవిలో అర్బన్ పార్క్ ఏర్పాటు చేస్తున్నట్లు, కొంతమంది సందర్శకులు ఇప్పటివరకు పూర్తిచేసిన పనులను చూసి వెళ్తున్నారు. వేసవి పూర్తయ్యేవరకు అన్ని పనులను పూర్తిచేసి అందుబాటులోకి తెచ్చే విధంగా కలెక్టర్‌తో పాటు అటవీ శాఖ అధికారులు పనుల పురోగతిపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్నారు. ఈ పార్క్ పనులు పూర్తయితే అడవికే అందాలు రానున్నాయి.

ఆహ్లాదాన్ని పంచనున్న అర్బన్ పార్క్



జిల్లా ప్రజలకు ఆహ్లాదం పంచేందుకు అర్బన్ పార్క్ కోసం తమ గ్రామాన్ని ఎంపికచేయడం సంతోషం. మంత్రి కేటీఆర్ ఈ ప్రాంతాన్ని పరిశీలించి 50 హెక్టార్లలో అర్బన్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని చెప్పగానే అటవీశాఖ అధికారులతో మాట్లాడాం. పార్క్‌తో తమ గ్రామానికి రాష్ట్రస్థాయిలోనే గుర్తింపు రానుంది. మంత్రికి రుణపడి ఉంటాం.

– చీటి లక్ష్మణ్‌రావు, జెడ్పీటీసీ, ఎల్లారెడ్డిపేట

పట్టణాలకు దీటుగా..



అర్బన్ పార్క్‌లో ఏర్పాట్లు అద్భుతంగా ఉన్నాయి. పట్టణాలకు దీటుగా నిర్మాణ పనులు చేశారు. ఈ ప్రాంత ప్రజలు సేద దీరడమే కాకుండా ప్రకృతిని ఆస్వాదించే గొప్ప అవకాశం కల్పించారు. రానున్న కాలంలో ఇది గొప్ప పర్యాటక కేంద్రంగా తయారు కానుంది. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి.

– మోతె మధు సూదన్‌రెడ్డి, సందర్శకుడు

ప్రకృతిని ఆస్వాదించేందుకే..



ప్రజలు ప్రకృతిని తెలుసుకునేలా ఈ పార్క్ ఏర్పాటు చేస్తున్నాం. సహజత్వం కోల్పోకుండా సందర్శకులు సేద తీరేలా.. అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. యువత, విద్యార్థులు పట్టణాల నుంచి వచ్చేవారికి అవగాహన కలిగేలా బయోడైవర్సిటీని నేర్చుకునేలా పార్క్ పరిసరాలు ఉంటాయి. మలి సంధ్యలో ప్రకృతి అందాలను తిలకించేందుకు వయో వృద్ధులకు అన్ని వసతులు కల్పిస్తున్నాం.

– శ్రీనివాసరావు, ఎఫ్ఆర్వో, సిరిసిల్ల

పవర్ కట్

నేడు విద్యుత్ సరాఫరాలో అంతరాయం

ఎల్లారెడ్డిపేట: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ వైర్లకు ఆనుకోని ఉన్న చెట్ల కొమ్మలను తీసివేసేందుకు గురువారం కరెంట్ సరాఫరా నిలిపివేస్తున్నట్లు సెస్ ఏఈఈ దివ్య తెలిపారు. ఈ సబ్‌స్టేషన్ పరిధిలోని దుమాల, ఎల్లారెడ్డిపేట గ్రామాల్లో ఉదయం 6 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరాఫరాకు అంతరాయం ఉంటుదని వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

నియామకం

క్రిస్టియన్ సెల్ జిల్లా అధ్యక్షుడిగా అనంద్



వేములవాడఅర్బన్: వైఎస్సార్‌సీపీ జిల్లా క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడిగా కొలాపూరి అనంద్‌ను నియమించినట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు చొక్కల రాము ఒక ప్రకటనలో తెలిపారు.

అంగన్‌వాడీ టీచర్ల సెక్టార్ సమావేశం


సమావేశంలో సూపర్‌వైజర్ రేణుక

వీర్నపల్లి: మండల కేంద్రంలోని అంబేడ్కర్‌నగర్ అంగన్‌వాడీ సెంటర్లో అన్ని గ్రామాల అంగన్‌వాడీ టీచర్లతో సెక్టార్ సమావేశం సూపర్‌వైజర్ రేణుక బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లు కేంద్రానికి వచ్చిన పిల్లల, గర్భిణుల వివరాలు నమోదు చేయాలని, ఫిర్యాదులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గర్భిణులు, పిల్లలకు గుడ్లు, పాలు అందుతున్నాయా, అందకపోతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. పిల్లలు అధిక సంఖ్యలో పాల్గొనే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్రాలకు ప్రతినెల వారీగా పంపిణీ చేస్తున్న కోడిగుడ్లు నెలకు మూడు దఫాలుగా తెలంగాణ ముద్రతో పంపిణీ చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు వినయకుమారి, జ్యోతి, నాగరాణి పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



గంభీరావుపేట: మండలంలోని గోరింటాల గ్రామంలో శ్రీమల్లికార్జునస్వామి ఆలయ నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కొలుముల అంజమ్మ, యాదవ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సంక్షేమ ఫలాలు పేదలకు అందడం లేదు

సిరిసిల్లఅర్బన్: తెల్ల రేషన్ కార్డుల విషయంలో నిరుపేదల కంటే ధనికులే ఎక్కువ లబ్ధిపొందుతున్నారని సిరిసిల్ల పౌర సంక్షేమ సమితి అధ్యక్షుడు బియ్యంకార్ శ్రీనివాస్ అన్నారు. పట్టణంలో సిరిసిల్ల పౌర సంక్షేమ సమితి బుధవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. తెల్ల రేషన్ కార్డుల జారీ విషయంలో వాస్తవంగా పేదలను గుర్తించకుండా విచ్చలవిడిగా తెల్ల కార్డులను అధికారులు జారీ చేశారన్నారు. ఆర్థికంగా ఉన్నవారు రేషన్ బియ్యాన్ని అమ్ముకుంటున్నారన్నారు. దీనిపై దృష్టి సారించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఉపాధ్యక్షుడు గజబీంకార్ మల్లాజీ, సత్యనారాయణ, కుసుమ గణేశ్, ప్రతాప్, సందీప్ పాల్గొన్నారు.

పౌరహక్కుల దినోత్సవం

ముస్తాబాద్: మండలంలోని బందనకల్‌లో పౌరహక్కుల దినోత్సవం బుధవారం నిర్వహించారు. ఎస్సీ కాలనీలో దళితుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆర్ఐ శ్యామ్, సర్పంచ్ వెంకటేశ్వరి, ఉపసర్పంచ్ కార్తీక్‌రెడ్డి, ఎంపీటీసీ రామచంద్రారెడ్డి, నారాగౌడ్ పాల్గొన్నారు.

నర్సరీల పరిశీలన


ఇల్లంతకుంట: మండలంలోని ముస్కాన్‌పేట, తాళ్లపల్లి గ్రామాల్లోని హరిత నర్సరీలను బుధవారం ఏపీవో చంద్రయ్య పరిశీలించారు. జూన్ చివరి నాటికి నర్సరీలలో మొక్కలను సిద్ధం చేయాలని, ఎండాకాలం కాబట్టి మొక్కలను నీడ కోసం షేడ్ నెట్లు ఏర్పాటు చేయాలన్నారు.

దశాబ్ది ఉత్సవాలు విజయవంతం చేయాలి

ముస్తాబాద్/బోయినపల్లి/చందుర్తి: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను ఏర్పాట్లపై మండల పరిషత్ కార్యాలయాల్లో సమీక్ష బుధవారం సమన్వయ సమావేశాలు నిర్వహించారు. ఈ ఉత్సవాలను 21 రోజుల పాటు ఘనంగా నిర్వహించుకోవాలన్నారు. అన్ని వర్గాల ప్రజలను దశాబ్ది ఉత్సవాల్లో భాగస్వాములను చేయాలన్నారు. ముస్తాబాద్‌లో ఎంపీపీ జనగామ శరత్‌రావు, డీపీవో రవీందర్, జెడ్పీటీసీ నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, ఎంపీడీవో రమాదేవి, ఏవో వెంకటేశ్, బోయినపల్లి ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, జెడ్పీటీసీ కత్తెరపాక ఉమ, తహసీల్దార్ నరేశ్, ఎంపీడీవో రాజేందర్‌రెడ్డి, సెస్ డైరెక్టర్ సుధాకర్, ఏఎంసీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొండయ్య, చందుర్తిలో ఎంపీపీ బైరగోని లావణ్య, తహసీల్దార్ యండి.మజీద్, ఎంపీడీవో రవీందర్, పంచాయతీరాజ్ శాఖ డీఈ భూమేశ్, రుద్రంగి మార్కెట్ కమిటీ అధ్యక్షుడు ఏనుగుల శ్రీనివాస్, సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాస్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యుడు కమలాకర్ అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ శరత్‌రావు

చిత్రకథ



చీకట్లో భయం భయంగా..

తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లి డబుల్ బెడ్రూం సుముదాయం (కేసీఆర్ నగర్)కు రాత్రివేళల్లో ప్రయాణించాల్సి వస్తే జంకుతున్నారు. రోడ్డు పొడవునా ఒక్కచోట కూడా లైట్లు ఏర్పాటు చేయకపోవడంతో చిమ్మ చీకట్లో ప్రయాణించాల్సి వస్తోందని గ్రామస్తులు వాపోతున్నారు. ముఖ్యంగా మహిళలు కాలినడకన వెళ్లాలంటే బెంబేలెత్తుతున్నారు. రోడ్డు పొడవునా విద్యుత్ స్తంభాలు ఉన్నప్పటికీ లైట్లు ఏర్పాటు చేయలేదని ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి కేసీఆర్‌నగర్ రోడ్డు పొడవునా లైట్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

ముస్తాబాద్: ముస్తాబాద్‌లో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని వార్డు సభ్యులు పంచాయతీ కార్యాలయం ఎదుట వార్డు సభ్యులు బుధవారం ధర్నా చేపట్టారు. అనంతరం గాంధీ విగ్రహనికి వినతిపత్రం సమర్పించారు. వార్డు సభ్యులు బుర్ర రాములు, భాగ్య, పల్లె సత్యం, నర్సింలు, వెంకటేశ్ మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శి నిబంధనలకు విరుద్ధంగా ఇళ్ల అనుమతులు ఇస్తున్నారన్నారు. సర్పంచ్ భర్త నిర్మిస్తున్న ఇంటికి సెట్‌బ్యాక్ పాటించకుండా పనులు చేస్తున్న అధికారులు ఎందుకు మౌనంగా ఉంటున్నారన్నారు. పాలకవర్గ సమావేశంలో అక్రమ నిర్మాణాలపై చర్చించకుండానే సమావేశం ముగించారని ఆరోపించారు. మెజార్టీ సభ్యులు హాజరైనా సమావేశాన్ని వాయిదా వేశారన్నారు. జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సర్పంచ్ గాండ్ల సుమతి మాట్లాడుతూ నిబంధనల ప్రకారమే తాము పనులు చేపట్టామని స్పష్టం చేశారు. రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు. ఆబాది, గ్రామ కంఠం భూముల నిబంధనలకు లోబడే పనులు చేపట్టామన్నారు. పంచాయతీలో తీర్మానాలు అవసరం లేదన్నారు.


కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వార్డు సభ్యులు

బిల్ కలెక్టర్‌కు బాధ్యతలు

ముస్తాబాద్ మేజర్ పంచాయతీ కార్యదర్శి రాజు దీర్ఘకాలిక సెలవులో వెళ్లారు. బిల్ కలెక్టర్ నరేశ్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. అయితే జూనియర్ అసిస్టెంట్‌గా తాను ఉండగా బిల్ కలెక్టర్‌కు ఏవిధంగా బాధ్యతలు ఇస్తారని బిక్షపతి ఆవేదన వ్యక్తం చేశారు. 27 ఏళ్ల సుదీర్ఘ అనుభవం పంచాయతీరాజ్ శాఖలో ఉందన్నారు. తనకంటే జూనియర్ అయిన బిల్‌కలెక్టర్‌కు పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించడంపై అధికారులకు ఫిర్యాదు చేస్తామని బిక్షపతి తెలిపారు.

రైతులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

ముస్తాబాద్: రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉందని టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు అన్నారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆవునూర్ కేడీసీసీ బ్యాంక్ ఖాతాదారు గంగాడి దేవారాజు కుటుంబానికి రూ.4 లక్షల బీమా చెక్కును బుధవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతుబీమా అందిస్తున్న ఏకైక సీఎం కేసీఆర్ మాత్రమేనన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో కోటి ఎకరాల సాగు జరుగుతుందన్నారు. ఇప్పటికే యాసంగి ధాన్యాన్ని రికార్డు స్థాయిలో సేకరించామన్నారు. కేంద్ర ప్రభుత్వం సహకరించకున్న సీఎం కృషితో వ్యవసాయం పండగను చేశారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బద్ది కల్యాణి, మేనేజర్ శైనోద్దీన్, ఏనుగుల వేణు, భాను, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.


చెక్కు అందిస్తున్న చైర్మన్ రవీందర్‌రావు

ప్రభుత్వోద్యోగులకు పదవీ విరమణ తప్పదు

గంభీరావుపేట: ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ తప్పదని టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సుదీర్ఘకాలంగా అటెండర్‌గా విధులు నిర్వర్తించి బుధవారం పదవీ విరమణ పొందిన రాజనర్సయ్యను ఆయన శాలువాతో సత్కరించి మాట్లాడారు. ఉద్యోగులు అంకితభావంతో పనిచేస్తే ప్రజల్లో గుర్తింపు లభిస్తుందన్నారు. రాజనర్సయ్య సేవలు ఎప్పుడు మరువలేనివని ప్రశంసించారు. కార్యక్రమంలో ఎంపీపీ వంగ కరుణ, వైస్ ఎంపీపీ దోసల లత, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు, బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్ పాల్గొన్నారు.

కొనుగోళ్లు పూర్తిచేయాలని రైతుల రాస్తారోకో

కోనరావుపేట: కొనుగోలు కేంద్రాల్లో రైతుల అవస్థలను అధికారులు పట్టించుకోవడంలేదని, సమస్యలు పరిష్కరించడంలేదని ధర్మారంలో రైతులు రాస్తారోకో చేపట్టారు. రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గున్నాల అరుణ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు ఇంకా పూర్తి కావడంలేదని, తూకం వేసిన ధాన్యాన్ని తరలించేందుకు లారీలు రావడం లేదన్నారు. అధికారులు కొనుగోలు కేంద్రాల్లోని సమస్యలు పరిష్కరించడంలేదన్నారు. ఇప్పటికైనా స్పందించి కొనుగోలు కేంద్రాల్లో సమస్యలను పరిష్కరించి, కొనుగోళ్లను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.


రాస్తారోకో చేస్తున్న రైతులు

చిన్నపేగుకు అరుదైన ఆపరేషన్

సిరిసిల్ల: సిరిసిల్లలోని తారకరామా ఆస్పత్రిలో చిన్నపేగుకు అరుదైన ఆపరేషన్ చేశారు. ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌కు చెందిన శివరాత్రి మల్లేశం(35) కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఎల్లారెడ్డిపేట, కరీంనగర్ ఆస్పత్రుల్లో చూపించుకుని మందులు వాడినా ప్రయోజనం లేకుండా పోయింది. మల్లేశం కడుపునొప్పితో తారకరామా ఆస్పత్రిలో చేరగా.. పరీక్షించిన వైద్యుడు నరేశ్‌కుమార్ లాప్రోస్కోపిక్ ద్వారా చిన్నపేగుకు ఆపరేషన్ చేశారు. గాంగ్రియనెస్ ఆఫ్ స్మాల్ బౌల్ ఆపరేషన్‌ను సిరిసిల్లలో తొలిసారి నిర్వహించారు. ఆపరేషన్ విజయవంతం కావడంతో మల్లేశం పూర్తిగా కోలుకున్నారని డాక్టర్ నరేశ్‌కుమార్ తెలిపారు. అరుదైన ఆపరేషన్‌ను సిరిసిల్లలోనే చేయడంపై మల్లేశం కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. చిన్నపేగుకు ఆపరేషన్ చేసి మల్లేశం కడుపునొప్పి సమస్యను పరిష్కరించిన డాక్టర్ నరేశ్ కుమార్‌ను ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది అభినందించారు.


శివరాత్రి మల్లేశం

పచ్చ ధనమే



వేములవాడరూరల్: పచ్చదనం పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని జిల్లా అధికారులు ఇస్తున్న ఆదేశాలకు ఆ గ్రామంలో అందరూ పాటిస్తున్నారు. ప్రధానంగా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో కార్యాలయ ఆవరణతో పాటు చుట్టుపక్కల ప్రాంతంలో పచ్చని చెట్లతో ఆహ్లాదకరంగా ఆకట్టుకుంటుంది. మండలంలోని మర్రిపల్లి గ్రామ పంచాయతీ చుట్టుపక్కల పరిసరాల్లో సర్పంచ్ కట్కం మల్లేశం మొక్కలు నాటారు. దీంతో మండే ఎండలో కూడా మొక్కలు పచ్చదనంతో కళకళలాడుతోంది.

రిటైర్డ్ హెచ్ఎం మృతి



ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేటకు చెందిన రిటైర్డ్ హెచ్ఎం పి.వెంకటయ్య(82) అనారోగ్యంతో బుధవారం మృతిచెందారు. వారం రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతుండగా. కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందారు. గురువారం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

పుస్తె మెట్టెలు అందజేత

ముస్తాబాద్: నామాపూర్‌కు చెందిన దుద్దేడ నర్సింలు, లక్ష్మి కూతురు నాగలక్ష్మి వివాహానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు లగిశెట్టి శ్రీనివాస్ పుస్తె, మెట్టెలు, గాజులు, చీర బుధవారం అందించారు. ఉపసర్పంచ్ గుండవేని తిరుపతి, నాయకులు నిమ్మల గోపాల్, భాను, రాజు, తాడేపు ప్రశాంత్, మహేశ్, ప్రసాద్, నవీన్ పాల్గొన్నారు.

సివిల్ సప్లై చైర్మన్‌ను కలిసిన ఎంపీటీసీ

తంగళ్లపల్లి: రాష్ట్ర సివిల్ సప్లై చైర్మన్ రవీందర్ సింగ్‌ను బుధవారం తంగళ్లపల్లి మండలం చిన్నలింగాపూర్ ఎంపీటీసీ బైరినేని రాము కలిశారు. ఈ సందర్భంగా లారీల కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన చైర్మన్ అధికారులకు ఫోన్ చేసి సమస్యను త్వరగా పరిష్కరించాలని ఆదేశించినట్లు తెలిపారు.